

# విద్యార్థులతో వెట్టిచాకిరీ?



- వీడియో సోషల్ మీడియాలో వైరల్!
- వాంకిడి జెడ్పీఎస్ఎస్‌లో 'పర్యావరణ' వివాదంపై సంఘాలు సీరియస్!

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీఎస్ఎస్)లో పర్యావరణ పరిరక్షణ పేరుతో విద్యార్థులతో శారీరక శ్రమ, విద్యేతర పనులు చేయించారనే ఆరోపణలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. చదువుకోవడానికి వచ్చిన పిల్లలతో సోమవారం కార్మికులు చేయాల్సిన పనులు చేయిస్తున్నట్లు ఉన్న విజువల్స్ సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వైరల్ కావడంతో బాలల హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ తక్షణ విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

### అసలు ఏం జరిగింది..

సోమవారం సోషల్ మీడియాలో జడ్పీఎస్ఎస్ వాంకిడి పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ కార్యక్రమం పేరిట విద్యార్థులతో వారి వయస్సుకు మించిన భారమైన పనులు చేయిస్తున్నట్లు వీడియో వైరల్ అవుతుంది. మొక్కలు నాటడం వరకే పరిమితం కాకుండా, మట్టి మోయించడం, రాళ్ళు తరలించడం వంటి కఠినమైన పనులు చేయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో!

విద్యార్థులతో పనులు చేస్తున్న సందర్భంగా స్థానిక మీడియా ప్రతినిధి వీడియో తీస్తున్న సమయంలో సదరు ఉపాధ్యాయుడు తీవ్రంగా దూషించినట్లు తెలుస్తోంది. ఇది తమ బడి, తమ ఇష్టమని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోవాలంటూ కలెక్టర్‌ను ఉద్దేశించి సవాల్ విసిరినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియాను, సమాధానం చెప్పాల్సిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈ విధంగా బెదిరించడం దారుణమని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

### సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి

వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో పనులు చేయిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై వెంటనే విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థుల హక్కులకు భంగం కలిగించి, మీడియా ప్రతినిది పై దురుసుగా ప్రవర్తించిన బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారుల తుది నివేదిక ఆధారంగా చర్యలు ఉండే అవకాశం కనిపిస్తోంది.



# భారత్-ఏ ఘనవిజయం

### గుర్నూర్‌కు పది వికెట్లు


**గాలె:** శ్రీలంక పర్యటనలో భారత్-ఏ జట్టు అదరగొట్టింది. ఇరుజట్ల మధ్య ఆదివారం ముగిసిన రెండో అనధికారిక టెస్టులో భారత్-ఏ.. శ్రీలంక-ఏపై 10 వికెట్ల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టిన భారత పేసర్ గుర్నూర్ బ్రర్.. రెండో ఇన్నింగ్స్‌లో (6/68) ఆరు వికెట్లు తీసి పర్యాటక జట్టుకు ఘనవిజయాన్ని అందించాడు. నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌ను 543/9 వద్ద భారత్ డిక్లేర్డ్ చేయగా రెండో ఇన్నింగ్స్‌లో లంకేయులు 209 రన్స్‌కే కుప్పకూలారు. 36 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని జురెల్ సేన వికెట్లేమీ కోల్పోకుండానే ఛేదించింది.

# చాలాసార్లు మోసపోయా.. ప్రతి రూమర్ నిజమే

### పృథ్వీ షా కాబోయే భార్య అకృతి అగర్వాల్ క్రిప్టిక్ పోస్టులు వైరల్

### షాను ఉద్దేశించిందేనా?.. సోషల్ మీడియాలో జోరుగా చర్చ

**న్యూఢిల్లీ, జూలై 6:** భారత క్రికెటర్ పృథ్వీ షా వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆయనకు నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అకృతి అగర్వాల్ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన కొన్ని క్రిప్టిక్ పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాను చాలాసార్లు మోసపోయానని, సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రతి రూమర్ నిజమేనంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అకృతి తన పోస్టులో.. "నన్ను చాలాసార్లు మోసం చేశారు. అయినా నేను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అతడితో జీవితంలో ముందడుగు వేసిన తర్వాత ఇలా జరుగుతుందని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను" అని పేర్కొన్నారు. మరో పోస్టులో.. "అతడి గురించి సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి రూమర్ నిజమే" అని రాసుకొచ్చారు. అయితే ఈ పోస్టుల్లో ఎక్కడా పృథ్వీ షా పేరును ఆమె ప్రస్తావించలేదు. అనంతరం ఆ పోస్టులను ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యాఖ్యలు పృథ్వీ షాను ఉద్దేశించే చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయినప్పటికీ ఈ విషయంపై ఇప్పటివరకు పృథ్వీ షా గానీ, అకృతి అగర్వాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. ఆసక్తికరంగా, అకృతి ఇప్పటికీ పృథ్వీ షాను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవుతుండగా, వారి నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలు కూడా ఆమె ఖాతాలో అలాగే ఉన్నాయి. దీంతో ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. పృథ్వీ షా, అకృతి అగర్వాల్ ఈ ఏడాది మార్చిలో తమ నిశ్చితార్థాన్ని అధికారికంగా ప్రకటించారు. చాలా కాలంగా ప్రేమలో ఉన్న ఈ జంట తమ బంధాన్ని అభిమానులతో పంచుకోవడంతో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అకృతి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటిగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. మరోవైపు పృథ్వీ షా క్రికెట్ కెరీర్ కూడా గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. ఐపీఎల్-2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం దక్కలేదు. ఫిట్‌నెస్ సమస్యలు, పేలవమైన ఫామ్ కారణంగా జాతీయ జట్టుకు కూడా దూరమయ్యాడు. అయితే ఇటీవల తన పునరాగమనంపై స్పందిస్తూ.. భారత్ తరఫున మళ్లీ ఆడటమే తన లక్ష్యమని, మానసికంగా మరింత బలంగా తయారయ్యేందుకు విరామం తీసుకున్నానని, ఇప్పుడు మూడు రెట్లు ఎక్కువగా సాధన చేస్తున్నానని పృథ్వీ షా వెల్లడించారు.



# బురద రోడ్డుతో నరకయాతన!



- 'గొందిపటర్' గ్రామస్థులను పట్టించుకునేదెవరు..?
- అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణీల ఇబ్బందులు వర్ణనాతీతం
- కల్వర్టు నిర్మించాలని గ్రామస్థుల డిమాండ్

**ఉద్యమ కెరటం, జైనూర్:** పరిపాలన మారుతున్నా, ఏళ్లు గడుస్తున్నా ఆ గ్రామ ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. కనీస మౌలిక వసతి అయిన రహదారి సరిగ్గా లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. జైనూర్ మండలం జంగం గ్రామం పరిధిలోని గొందిపటర్ గ్రామ సరిహద్దు వద్ద ఒక చిన్న కల్వర్టు, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



### బురదమయమైన రహదారి

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గొందిపటర్ సరిహద్దు రహదారి దెబ్బతింది. అక్కడ పెద్దగా వాగు లేకపోయినప్పటికీ, వర్షపు నీరు సరిగ్గా వెళ్లే మార్గం (కల్వర్టు) లేకపోవడంతో ఆ ప్రాంతమంతా మోకాళ్లతోటి బురదమయంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు పడి నీరు నిలిచిపోతోంది. గొందిపటర్ గ్రామ ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండటానికి ఇదే ఏకైక ప్రధాన రహదారి. అయితే, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ మార్గంలో ప్రయాణించడం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు బురదలో ఇరుక్కుపోవడం, జారి కిందపడటంతో వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారు.

### నరకం చూస్తున్న విద్యార్థులు, గర్భిణీలు

ఈ చిన్న కల్వర్టు లేకపోవడం వల్ల గ్రామ ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రోజూ ఈ బురదలోనే నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు, పండించిన పంటను మార్కెట్కు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆసుపత్రికి వెళ్లాలన్నా, గర్భిణీలను తరలించాలన్నా బురద కారణంగా అంబులెన్స్ లేదా ఇతర వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంది. సమయానికి వైద్యం అందక ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

### అధికారులు స్పందించాలి..

వర్షం కురిసిన ప్రతిసారీ ఈ రహదారి మరింత అధ్వాన్నంగా మారుతోందని, పాలకులు, అధికారులు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇక్కడ పెద్ద వంతెనల అవసరం లేదని, కేవలం ఒక చిన్న కల్వర్టు నిర్మించి, రహదారిని బాగు చేస్తే సమస్య తీరుతుందని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

